నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

మెదక్

ఆదివారం | 03 మార్చి 2024 | www.navatelangana.com

మాజీ హోం మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీరయ్య యాదవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

మాజీ హోం మంత్రి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహమూద్ అలీ జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో తెలంగాణ ఉద్యమ కారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బీరయ్య యాదవ్ శనివా రం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఉస్మాన్ అలీ, అంజద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీ.బీ పాటిల్

- బీజేపీలో చేరిన రోజునే టికెట్
- రెండుసార్లు ఎంపీగా పని చేసిన అనుభవం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికలకు ముందే సిద్ధమవుతున్న బీజేపీ 195 మందితో తొలి జాబితాను ప్రకటించింది. అందులో తెలంగాణకు చెందిన 9 పార్లమెంట్ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించింది. తొలి జాబితాలు ముఖ్యమైన నాయకుల పేర్లు ఖరారయ్యాయి. అందులో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కూడా అభ్యర్థిగా బీబీ పాటిల్‌ను ఖరారు. బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలిచిన పాటిల్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీపేజీలో చేరిన మరుసటి రోజున్నే ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం విశేషం. దక్షిణ భారతంలో ఎక్కువ ఎంపీ సీట్లు గెల్వాలని చూస్తున్న బీజేపీ అధిష్టానం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 5న సంగారెడ్డి జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటించనున్న నేపథ్యంలో పార్లమెంట్ అభ్యర్థులను ప్రకటించారు. సీనియర్లతో పాటు కొత్తగా పార్టీలో చేరిన బీబీ పాటిల్ జహీరాబాద్ టికెట్ లభించడంతో ఆయన అనుచరులు ఉత్సాహపడుతున్నారు.


పార్టీలో చేరిన వెంటనే ఎంపీ టికెట్..

పదేండ్ల పాటు బీఆర్ఎస్‌లో ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం విధితమే. ఆయన కాషాయ కండువా కప్పుకున్న మరుసటి రోజున్నే బీజేపీ అధిష్టానం ప్రకటించిన తొలి జాబితాలో బీబీ పాటిల్‌కు చోటు ఇచ్చారు. వందల ఎకరాల వ్యవసాయ అధిపతిగా బడా వ్యాపార వేత్తగా ఆర్థిక పరిపుష్టి కల్గిన బీబీ పాటిల్ 2014లో రాజకీయ రంగంలోకి వచ్చారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమ పార్టీగా ఉన్న అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. ఆయన చేరిన వెంటనే 2014 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అతనికి జహీరాబాద్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించింది. ఆ ఎన్నికల్లో తొలిసారి పార్లమెంట్ సభ్యులుగా గెలిచారు. ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లోనూ ఆయన రెండో సారి టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలిచారు. రెండు సార్లు ఎంపీగా గెల్చి పదేళ్లపార్లమెంట్ సభ్యులుగా పనిచేసిన ఆయన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా పనిచేశారు. తొలి సారి ఎంపీ అయినప్పుడు 'పేపర్స్ లేయిడ్ ఆన్ టేబుల్ కమిటీకి సభ్యులుగా నియమించబడ్డారు. విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా, రోడ్డు రవాణా, జాతాయ రహదారుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సలహా సంఘం సభ్యులుగానూ ఆయన పనిచేశారు.

ఆర్థిక వనరులు, సామాజిక బలం

బీబీ పాటిల్‌ను బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. బీజేపీకి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బలమైన అభ్యర్థి లేరు. ఇతర పార్టీల నుంచి బలమైన నాయకుల్ని చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసుకోవాలనే ఎత్తుగడను అనురిస్తూ బీఆర్ఎస్‌కు పట్టున జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆ పార్టీలో రెండు సార్లు ఎంపీగా గెల్చిన పాటిల్‌ను అక్కున చేర్చుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో లింగాయత్‌ల సఖ్య గణనీయంగా ఉంది. అదే సామాజిక వర్గానికి చెందిన బీబీ పాటిల్‌ను పోటీ చేయించడం ద్వారా లబ్ధిపొందాలను బీజేపీ చూస్తుంది. అదే విధంగా మహారాష్ట్ర, బెంగుళూరు ఇతర ప్రాంతాల్లో వేల కోట్ల వ్యాపార సంస్థలున్నాయి. వందల కోట్లు ఎన్నికల్లో వెదజల్లే ఆర్థిక పరిపుష్టి, సామాజిక బలం పేరుతో బీబీ పాటిల్‌ను బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది.

బీబీ పాటిల్ ప్రొఫైల్..



పేరు : భీంరావు బసవంతరావు పాటిల్

పుట్టిన తేదీ : 1 నవంబర్ 1955

పుట్టిన ప్రాంతం : సిర్పూర్, నిజామాబాద్ జిల్లా

విద్యార్హతలు : బీఎస్సీ అగ్రికల్చర్

తల్లిదండ్రులు : హనుమాబాయి పాటిల్, బస్వంతరావు పాటిల్

కుటుంబ సభ్యులు : భార్య-అరుణ, కొడుకు కూతురున్నారు.

వృత్తి : వ్యవసాయాధిపతి, వ్యాపార వేత్త, రాజకీయ నాయకులు

రాజకీయ అనుభవం : జహీరాబాద్ నుంచి 2014,2019 ఎన్నికల్లో ఎంపీగా గెలుపు..

గీతం స్కాలర్ అన్నా తనూజకు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని బి.అన్నా తనూజ సఫాలాను డాక్టరేట్ వరించింది. 'బయోమాక్రో మోలిక్యూల్స్ బెంజిమిడాజోల్ కంజెనర్ల పరస్పర చర్యపై సమగ్ర బయోఫిజికల్, సిద్ధాంతక అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్‌ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బిజయ్ కేతన్ సాహు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ అధ్యయనం, ప్రయోగాత్మక పద్ధతులను ఉపయోగిస్తూ, పరస్పర చర్యల థర్మో డైనమిక్స్, జీవ పరమాణు నిర్మాణంపై ఉత్పన్నాల ప్రభావాన్ని విశ్లేషించింది. సమగ్ర పరిశోధన, పరమాణు పరస్పర చర్యలపై అవగాహనను పెంపొందించడమే గాక, హేతుబద్ధమైన ఔషధ రూప కల్పన, ఔషధ సరఫరా వ్యవస్థల అభివృద్ధికి లోతైన అవగాహనను కల్పించిందన్నారు. ఈ సందర్భంగా గీతం విశ్వవిద్యాలయం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్‌ఆఫ్ సైన్స్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఈ సందర్భంగా అన్నా తనూజకు అభినందించారు.



నానమ్మ, తాతయ్య జ్ఞపకార్థం రూ.6.61లక్షల విరాళం

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని దోమడుగు గ్రామానికి చెందిన అభిశెట్టి లక్ష్మయ్య.. ఆయన నానమ్మ, తాతయ్య కీర్తిశేషులు అభిశెట్టి బాలమ్మ, ముత్తయ్యల జ్ఞాపకార్థం పలు అభివృద్ధి పనులకు రూ.6.61లక్షల విరాళాన్ని అంద జేశారు. అందులో రామాలయ నిర్మాణానికి రూ.2.11 లక్షలు, స్థానిక పాఠశాలలో ఫర్నిచర్స్, అల్మారి తదితర అభివృద్ధి పనుల కోసం రూ.4.50లక్షల విరాళాన్ని సంబంధిత నిర్వాహకులకు శనివారం అందజేసినట్టు తాజా మాజీ సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్ తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం తనవంతు సహాయం ఎల్లప్పుడూ అందజేస్తానని అబిశెట్టి లక్ష్మయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణారెడ్డి, ఎం.సత్తిరెడ్డి, ఎం.ప్రకాష్ రెడ్డి, అభిశెట్టి యాదగిరి, అభిశెట్టి సంతోష్, పెంట్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ జిల్లా ఆఫీస్‌లోకి ఖేడ్ నాయకులు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్, కంగ్టి





కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కేవీపీఎస్ జిల్లా ఆఫీసులోకి జిల్లా ఉపాధ్యక్షులుగా నాగలిగిద్ద మండలం మొరిగేకి చెందిన సంతోష్, జిల్లా సహాయ కార్యదర్శిగా కంగ్టికి చెందిన దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీలోకి సిర్గాపూర్ నుంచి మోషప్ప, సంజీవరావుపేటకు చెందిన శ్రీనివాస్, బాచుపల్లికి చెందిన నితిన్, కల్హేర్‌కు చెందిన బాబురావు, మాయికోడ్‌కు చెందిన అరుణ్, నారాయణఖేడ్ నుండి బేగరి విజయ్ కుమార్, జూకల్‌కు చెందిన చంద్రశేఖర్, దేవునిపల్లికి చెందిన దత్తు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేసిన కొరారి నర్సింలును కేవీపీఎస్ నుంచి రిలీవ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా వారు మాట్లాడుతూ.. నారాయణఖేడ్ ప్రాంతంలో కేవీపీఎస్ సామాజిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. జిల్లా కమిటీ సభ్యులతో కలిసి కృషి చేస్తామన్నారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు.



ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రంలోని విజ్ఞాన జ్యోతి మోడల్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కరస్పాండెంట్ నాగన్న ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లింగాపూర్ పాఠశాలలో ఆర్వో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని లింగాపూర్ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి కోసం చార్ల మానయ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు ఎస్ఎఫ్‌సి చార్ల మణిదీప్ అన్నారు. మాజీ సర్పంచ్ లక్ష్మి మానయ్య సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా విద్యార్థులకు నిరంతరం అందించనున్నట్టు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ కమిటీ చైర్మెన్‌గా సుధాకర్ యాదవ్

నవతెలంగాణ-అమీన్‌పూర్



అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ కమిటీ చైర్మెన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బైస సుధాకర్ యాదవ్ నియమితుల య్యారు. పాలకమండలి సభ్యులుగా అరుణానరేందర్ రెడ్డి, నిర్మల రమేశ్ యాదవ్, గొల్ల మల్లేష్ యాదవ్, ఆశగారి లక్ష్మణ్, లక్ష్మీకాంతరావు, చంద్రశేఖర్, కుమ్మరి మహేష్, గోక మహిపాల్ రెడ్డి, దీపక్ గౌడ్, ఎల్మర్తి మల్లేష్ యాదవ్, బోయిని పెద్దులు, జనుముల శ్రీనివాస్, కుంచం ఎల్లయ్య నియమితులయ్యారు. పాలకమండలి ఆలయ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శశిధర్ ఆధ్వర్యంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి షుగర్ కేన్ ఇండస్ట్రీ మాజీ డిప్యూటీ కమిషనర్



నవతెలంగాణ-చేగుంట

షుగర్ కేన్ ఇండస్ట్రీ మాజీ డిప్యూటీ కమిషనర్, చేగుంట పట్టణానికి చెందిన తీగల భూమి లింగం గౌడ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి.. శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో భూమి లింగం గౌడ్‌కు పార్టీ కండువా కప్పి సాదంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమెల్సీఅండ్ టీపీసీసీ కార్యనిర్వాక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ గౌడ్, సిద్దిపేట్ నియోజకవర్గ ఇంచర్జ్ హరికృష్ణ, లక్ష్మణ్, ప్రభాకర్, సుప్రభతరావు, రామచందర్, వెంకట్ రెడ్డి, అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



చెరకు తోట దగ్ధం..

- సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం

నవతెలంగాణ-ఝరాసంగం

సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో ప్రమాదవశత్తు ఓ రైతు చెరకు పంటకు నిప్పంటుకుని 0.20 గంటల పంట దగ్ధమైంది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. బాధితుడి, స్థానికుల వివరాల ప్రకారం.. ఎల్గోయి గ్రామానికి చెందిన పెద్దగొల్ల మణెన్న గ్రామ శివారులో 2 ఎకరాల్లో చెరకు పంట సాగు చేస్తున్నాడు. అయితే శుక్రవారం రాత్రి తోటనుంచి పొగలు రావడం గమని ంచిన స్థానిక రైతులు సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే 0.20 గుంటల మేర పంటతో పాటు డ్రిప్పుపైపులు సైతం కాలిపోయాయి.సుమారు రూ.50వేల ఆస్తినష్టం జరిగినట్టు బాధిత రైతు వాపోయాడు.

మరోసారి బీజేపీ వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు ఖాయం

- మతోన్మాద బీజేపీని ఎన్నికల్లో ఓడించాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-సంగారెడ్డి

మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయమని.. కాబట్టి లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి.అశోక్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ కులాల మధ్య కుంపటి రాజేసి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తోంన్నారు. మతోన్మాదాన్ని అడ్డుకొని రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. భారతదేశ ప్రజలకు గుండెకాయ లాంటి భారత రాజ్యాంగం పనికిరాదని మనుస్మృతి తమకు ప్రాచీన భారత రాజ్యాంగం అని ఆర్ఎస్ఎస్ బహిరంగంగా ప్రకటించిందని గుర్తు చేశారు. పదేం డ్లు అధికారంలో ఉన్న బీజేపీ.. దళితుల కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదన్నారు. పైగా బీజేపీ పాలనలో దళితులపై 300 రెట్లు దాడులు దౌర్జన్యాలు పెరిగాయన్నారు. దేశం సరిహద్దు వివాదాలు రెచ్చగొట్టడం, దేశంలో పల మతవిద్వేషాలను ఉద్రిక్తతలను సష్టించడం గ్రామ సీమల్లో కుల ఘర్షణలను సష్టించడం ద్వారా బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. దేశ అభివద్ధి కుంటుపడుతుందని జిడిపి తగ్గుతుందని.. నిరుద్యోగం పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తాము మెజార్టీ హిందువుల ప్రతినిధులమని గొప్పలు చెప్పుకుంటున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ ఎందుకు దళితులను వేల ఏండ్లుగా ఊరి బయట ఉంచిందో చెప్పాలన్నారు. కుల వ్యవస్థను, చాతుర్వర్ణ వ్యవస్థను, సామాజిక అసమానతలను ఆర్ఎస్ఎస్, బీజేపీ పెంచి పోషిస్తున్నాయన్నారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ.. 10 ఏండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని అలాంటిది కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి 750 మంది రైతులను పొట్టను పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 29 కార్మిక చట్టాలను ఒక్క కలం పోటుతో రద్దు. చేసిన బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడలు తెచ్చిందన్నారు. దేశంలో బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం పరిహాసం చేయబడుతుందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడగొట్టిందన్నారు. దేశం గర్వించదగ్గ మేధావులను పొట్టన పెట్టుకుందన్నారు. ప్రశ్నించే గొంతుకులను చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని జైల్లో నిర్బంధిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం మరోసారి వస్తే రాజ్యాంగ మూల స్తంభాలైన ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామాజిక న్యాయం, ఫెడరలిజం ధ్వంసం చేస్తుందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించడం ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ మాట్లాడుతూ.. మార్చి ఏప్రిల్ నెలలో మహనీయుల మాసాలుగా గౌరవిస్తూ పూలే అంబేద్కర్ జన జాతరలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పులే, అంబేద్కర్ ఆశయా లను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరు కషి చేయాల న్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా జిల్లా సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఇటీవల మేధావి కత్తి పద్మారావు పై మనువాదులు బెదిరింపులకు పాల్పడటానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశం ప్రారంభంలో అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్స్ న్యాయవాది కె. సుభాష్ మద్దూరి శివకుమార్, బి.ప్రవీణ్, సంతోష్, దాస్, మల్లేష్, జిల్లా నాయ కులు వివిధ మండలాల నాయకులు మల్లేశం, దాస్ , మహేష్ ,శ్రీనివాస్, శేఖర్, బాబురావు, నరేష్, సంతోష్, సుదర్శన్, నాగరాజు, జయరాం, దత్తు, చంద్రశేఖర్, పెంటయ్య, రాజేందర్, ప్రదీప్, అరుణ్, వెంకటేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

హాజరైన జిల్లా మహిళా వెల్ఫేర్ అధికారి లలిత కుమారి

నవతెలంగాణ-రామచంద్రాపురం



ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యుత్‌నగర్‌లో శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మహిళా వెల్ఫేర్ అధికారిని లలిత కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడాలన్నారు. అంగన్వాడీ సెంటర్స్‌ను పెంచుతామని, చైల్డ్‌కేర్‌లో ఎక్కడ కాంప్రమైజ్ కాబోమన్నారు. ప్రతీ విషయంలో మగవారికి సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నో సౌకర్యాలను కల్పించారని వాటిని వినియోగించుకోవాలన్నారు. మగవాళ్ళు తమ ఇంటి మహిళలకు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, కౌన్సిలర్స్ లు సరిత శ్రీనివాస్ రెడ్డి, పావని, మంజుల కాంగ్రెస్ నాయకులు అరుణ్ గౌడ్, మవీన్ గౌడ్, తూర్పు శ్రీను, రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలని సూచన

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్



ఇంటర్మీడియెట్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన, సేవా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్, సిపిలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ 19 వరకు జరిగే ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే 10వ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని, కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా చిన్నపొరపాటు జరగకుండా పరీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్క అర్హుడికి ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంట ందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, అదే విధంగా మున్సిపాలిటీలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన మేర డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని, అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్ తదితర సామాగ్రి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, కమిషనర్ ఆఫ్ పోలీస్ అనూరాధ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

- సంగారెడ్డి జిల్లాకు గుండెకాయ లాంటి మంజీరాను కాపాడాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లాలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి కాలుష్య కారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, సంగారెడ్డి జిల్లాకు గుండెకాయ లాంటి మంజీరా నదిని కాలుష్యం నుండి కాపాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి పీసీబీ ఆఫీసులో ఏవో శ్రావణ్‌కి శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న కాలుష్య కారక కంపెనీలపై తక్షణమే చర్యలు తీసు కుని.. కాలుష్యాన్ని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కంపెనీల కాలుష్యం వల్ల మంజీరా పూర్తిగా కలుషితమవుతున్నదన్నారు. నీళ్లు పచ్చగా మారి గుర్రపు డెక్క పెరిగినా.. అధికారులు స్పందించే పరిస్థితి లేదన్నారు. చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై.. రైతుల పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యం అరికట్టాలన్నారు. లకడారం ప్రాంతంలోని కంకర్ల క్రషర్ల వాయు కాలుష్యం పై చర్యలు తీసుకోవాలని పలు పిటిషన్‌లు ఇచ్చినా.. అధికారులు స్పందించడం లేదన్నారు. జిన్నారం మండల గడ్డపోతారం అయ్యమ్మ చెరువుపైన ఉన్న కెమికల్ కంపెనీల కాలుష్యంతో అయ్య మ్మ చెరువు పూర్తిగా కలుషితమై పోయిందన్నారు. చెరువుల్లోని జీవరాసులు, చేపలు కూడా చనిపోతున్నాయన్నారు. కాజిపల్లి, సుల్తాన్‌పూర్ చెరువులు కూడా పూర్తిగా కలుషితమై పోయాయన్నారు. పాశమైలారం కంపెనీల కలుషితం వల్ల రుద్రారం, ఇస్నాపూర్ చెరువులు పూర్తిగా కలుషితమై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కలు షిత జలాలు నక్కవాగు ద్వారా మంజీరాలో చేరు తున్నాయ న్నారు. వివిధ మండలాల్లోని కంపెనీల కలుషితం వల్ల మం జీరా, మంజీరా పైన ఉన్న చెరువులు, కుంటలు, బావులు కలుషితమై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని కంపె నీల్లో ఈటీపి ప్లాంట్ పెట్టియించాలన్నారు. పర్యవేక్షణ చేయ ని పీసీబీ అధికా రులపై చర్యలు తీసుకోవాలని డిమా ండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్య లునర్సింలు, నాయకులు నర్సింహరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాకు అవగాహన వొద్దు.. ఇథనాల్ పరిశ్రమ వొద్దు

- సదస్సును బహిష్కరించిన గుగ్గీల్ల, తిమ్మాయిపల్లి, నర్సింహుల పల్లి గ్రామస్తులు
- చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు : సీఐ శ్రీనివాస్

నవతెలంగాణ-బెజ్జంకి



మాకు అవగాహన వద్దు..ఇథనాల్ పరిశ్రమ నిర్మాణమే వద్దంటూ గుగ్గీల్ల, తిమ్మాయిపల్లి, నర్సింహులపల్లి గ్రామస్తులు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సును బహిష్కరించారు. శనివారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలో ఓ పంక్షన్ హాల్ యందు పరిశ్రమ ప్రతినిధులతో కలిసి సీఐ శ్రీనివాస్ అధ్వర్యంలో ఇథనాల్ పరిశ్రమపై గ్రామస్తులకు నెలకొన్న అపోహలను నివృత్తి చేయడానికి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సమావేశం మధ్యలోనే.. మాకు పరిశ్రమ వద్దంటూ అయా గ్రామాల ప్రజలు బహిష్కరించి వెళ్లడం విశేషం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడుతామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. అంతకు ముందు మండల కేంద్రంలో ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్ల అనుమతులను సీఐ శ్రీనివాస్ ఎస్ఐ క్రిష్టారెడ్డితో కలిసి తనిఖీ చేశారు.

కుమారుడు పుట్టినరోజున విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ

నవతెలంగాణ-మునిపల్లి



మండలంలోని మేళాసంఘం గ్రామానికి చెందిన తాటిపల్లి ప్రదీప్ రెడ్డి తన కుమారుడు విఘ్నేశ్వర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు ఆట వస్తువులు ఇతర సామాగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి, గ్రామ కార్యదర్శి వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీ.బీ పాటిల్‌కు వ్యతిరేకంగా బీజేపీలో ఆందోళనలు

- రాష్ట్ర అధ్యక్షుడి వద్దకు నియోజకవర్గ నాయకులు

నవతెలంగాణ-జహీరాబాద్



ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరి 24గంటలు గడవకముందే బీజేపీలో ఆందోళనలు మొదలయ్యాయి. ఈ మేరకు శనివారం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు శాసనసభ నియోజకవర్గాలకు చెందిన బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వద్దకు వెళ్లి తమ నిరసనను తెలిపారు. బి.బి పాటిల్ ప్రజలకు అందుబాటులో ఉండడని.. ఆయనకు తెలుగు కూడా సరిగ్గా మాట్లాడడానికి రాదని కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా ఎన్నికలప్పుడు ప్రత్యక్షమై అనంతరం పూనాలో, ఢిల్లీలో ఉంటాడని.. అలాంటి వ్యక్తికి బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే తాము ఎట్టి పరిస్థితుల్లో కూడా పనిచేయమని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు నియోజకవర్గంలోని నాయకులు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ నుంచి గెలుపొంది.. ఆ పార్టీని నాశనం చేసి నేడు తన వ్యాపారాలను కాపాడుకునేందుకు మాత్రమే బీజేపీలో చేరాడని దుయ్యబట్టారు. కాగా ఈ గందరగోళం ఇలాగే కొనసాగుతుండగానే బీజేపీ అధిష్టానం విడుదల చేసిన మొదటి లిస్ట్‌లో జహీరాబాద్ ఎంపీ సీట్‌ను బి.బి పాటిల్‌కు కేటాయించారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు గ్రూపులుగా విడిపోయి ఆందోళన చేపడుతున్న ఈ తరుణంలో.. ఈనెల 5న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రధాని మోడీ సభలో ఏ స్థాయిలో గందరగోళం జరుగుతుందో అని సీనియర్ నాయకులు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-రామచంద్రాపురం

సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్న సంగారెడ్డి జిల్లా జట్టు క్రీడాకారులకు తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ బాలాగౌని రాములు గౌడ్ శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించాలన్నారు. క్రీడాకారుల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిచరణ్, ఆర్గనైసింగ్ సెక్రటరీ శివయ్య క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కేతకి హుండీ ఆదాయం రూ.21.43 లక్షలు



నవతెలంగాణ-ఝరాసంగం

మొగలి వనంలో నెలకొన్న శ్రీ పార్వతీ సమేత కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో శనివారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ అధికారులు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహా రాష్ట్రల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి కానుకల రూపంలో గత 70 రోజులుగా హుండీలో వేసిన నగదును లెక్కించగా.. రూ. 21,43,807 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహన అధికారి శ్రీధర్ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో శ్రీ భ్రమరాంబ రాజరాజేశ్వరి ట్రస్ట్, ఆలయ సిబ్బంది, అర్చకు లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి రంగారావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, ఆలయ సిబ్బంది, అర్చకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సాబిత్రి దేవి పాలిమర్స్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి 17వ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్న విషయం విధితమే. అయితే అందులో భాగంగా బొల్లారానికి చెందిన సాబిత్రి దేవి పాలిమర్స్ ప్రయివేటు లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆలయం వద్ద శనివారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమ డైరెక్టర్ సిద్దార్థ్ అగర్వాల్, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో సీసీరోడ్ల ప్రారంభం

నవతెలంగాణ-పుల్కల్

మండల పరిధిలోని కోడూరులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి చేతుల మీదుగా గ్రామంలోని పలు వీధుల్లో సీసీరోడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ ప్రత్యేక శ్రద్ధ వహించి.. మండలంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఏ గ్రామంలోనూ మట్టిరోడ్లు ఉండొద్దనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, గోవర్ధన్, లక్ష్మారెడ్డి, మాజీసర్పంచ్ భూమిరెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-పుల్కల్

చౌటకూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ జన్మదిన వేడుకలను శనివారం తాడ్దాన్‌పల్లి చౌరస్తా వద్ద పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. దశరథ్‌ను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఉదయ్‌కుమార్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మునిపల్లి

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామంలోని లక్ష్మీ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ 1998 – 99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యాపకులు బెంజిమెన్, వాసు, రామచంద్రయ్య, ఇతర అధ్యాపకులను విద్యార్థులు ప్రత్యేకంగా ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. వారితో కలిసి గత స్మృతులను, అనుబంధాలను పంచుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో కలిసి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యు లతో కలిసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి తమ ఆనందాన్ని పంచు కున్నారు. కంకోల్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు జనార్ధన్, శ్రీశైలం, రాజే శ్వర్, సంతోష్, అరుణ, అంజలి, గౌరిష, సుమిత్రలు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ప్రధానమంత్రి బహిరంగ సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-సంగారెడ్డి

మార్చ్ 5న దేశ ప్రధాని నరేంద్ర మోడీ సంగారెడ్డి జిల్లాకు వస్తున్న సందర్భంగా పటాన్చెరు పటేల్ గూడాలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రభు గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా సంగారెడ్డి జిల్లాకు నరేంద్ర మోడీ వస్తున్నారని.. ముందుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి జాతికి అంకితం చేస్తారన్నారు. అనంతరం పటాన్చెరు నియోజకవర్గంలో పటేల్ గూడాలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. మూడోసారి తిరిగి బీజేపీ మోడీ ప్రభుత్వం భారీ మెజార్టీతో వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కసిని వాసు, మందులు నాగరాజ్, ద్వారక రవి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ లోని గెస్ట్ హౌస్ ఎదుట పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం మండలాధ్యక్షులు మహమ్మద్ అతర్ అహ్మద్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు సేవలందించేందుకే ఎంఐఎం ఏర్ప డిందన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మెన్ అజ్మత్ పాషా, ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, సంయుక్త కార్యదర్శులు అమేర్ బిన్ అబ్దుల్లా, షోయెబ్ షేక్, ఇలియాజ్ వివిధ వార్డుల అధ్యక్షులు షఫీ, ముజీబ్ రహీమ్ అయ్యూబ్, సయ్యద్ మొహిసిన్, యూనుస్, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వరికి తెగులు.. రైతుకు గుబులు



ఎన్ని రకాల మందులు వాడినా ప్రయోజనం శూన్యం

- వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ కరువు
- పొలాలను చూసి కంటతడి పెడుతున్న రైతన్నలు

> ప్రస్తుతం వరిపొలాల్లో వస్తున్న తెగులు.. రైతన్న గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. కంటికి రెప్పలే కాపాడు కుంటున్న పంట చేన్లు.. కండ్ల ముందే తెగులుతో ఎండిపోతుంటే ఏం చేయాలో తెలియక రైతన్న కంటతడి పెడుతున్నాడు. ఎన్ని మందులు తెచ్చి వాడినా.. ఫలితం మాత్రం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కూరుకుపోతున్నాడు.

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండలంలో రైతులు ఎక్కువ శాతం వరిపైనే ఆధారపడి పంట సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో ఉన్న మంజీరా నది అలాగే సింగూరు ఎడమ కాలువ ద్వారా సాగుకు నీరందుతుండడంతో ఇక్కడ ఎక్కువగా వరిపంటనే వేస్తుంటారు. ఈ సీజన్‌లో కూడా పుల్కల్ ఉమ్మడి మండలం కింద సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరిపంట సాగు అవుతున్నది. అయితే చాలా చోట్ల నీటి ఎద్దడితో పంటలు దెబ్బతింటుంటే.. ఇక్కడేమో తెగులుతో పంట మొత్తం నాశనం అవుతున్నది. కొందరు జనవరి నెల ప్రారంభంలో వరినాట్లు వేయగా.. రెండు నెలలు గడిచినా పంట అలాగే ఉండిపోయింది. పంటలో ఎలాంటి వృద్ధి లేకపోయింది. దాంతో పంట రక్షణ కోసం పురుగు మందులు, రసాయన మందులు ఎన్ని వాడినా ఫలితం మాత్రం దక్కడం లేదు. ఫర్టిలైజర్ దుకాణాల్లో వేలు పోసి.. వారు చెప్పిన మందులు పిచికారి చేసిన పంట మంచిగవ్వట్లేదని రైతులు వాపోతున్నారు. పంటలపై సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అధికారులు.. చుట్టపు చూపుగా ఒకరెండు సార్లు మీటింగ్‌లు పెట్టి వెళ్లిపోయారని.. వారు సరైన సలహాలు ఇస్తే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని పలువురు ఆరోపిస్తున్నారు. లక్షల పెట్టుబడి కండ్ల ముందే నాశనం అవుతుంటే ఏం చేయాలో అర్థం కావట్లేదని రైతులు బోరున విలపిస్తున్నారు. ఈ దుస్థితి గురించి వ్యవసాయాధికారులకు తెలిసినప్పటికీ.. కనీసం స్పందించట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కపక్క ఎండిపోతున్న పంట.. మరోపక్క రోజురోజుకూ పెరుగుతున్న పెట్టుబడి అప్పుల కుప్ప మధ్య రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



ఆదుకోండి సారూ..



నాకున్న ఐదెకరాల్లో వరి పంటను సాగు చేశాను. సాగు చేసిన మొదటి దశలో బాగానే ఉన్నప్పటికీ నెల రోజుల తర్వాత.. దానికి చీడపీడల బాధ ఎక్కువైంది. అనుభవం ఉన్న రైతులు చెప్పిన మందులను చాలాసార్లు పిచికారి చేశాను. అయినప్పటికీ ఏ మాత్రం ఫలితం లేకపోయింది. పైన్న ఉన్న ఆకులతోపాటు కాండం కూడా ఎండిపోతున్నది. ఏమి చేయాలో అర్థంకాక మండల వ్యవసాయ అధికారులకు చెప్పాను. వారు చెప్పిన మందులు కూడా వాడాను. అయినా పంట మాత్రం మంచిగ అవ్వలేదు. పంట పూర్తిగా ఎండిపోయే దశకు వచ్చింది. సాగు కోసం తెచ్చిన అప్పులు ఓపక్క పెరుగుతున్నాయి.. ఇక్కడేమో పంట ఎండుతున్నది. ఇప్పుడు ఆ అప్పు ఎలా తీర్చాలి. నిద్రాహారాలు మానుకొని పొలం దగ్గరే ఉంటున్నాను. పంటను చూస్తుంటే కన్నీళ్లు ఆగడం లేదు. నా పరిస్థితి అర్థం చేసుకుని.. ప్రభుత్వమే నాకు సాయం చేయాలి.

– కుమ్మరి లక్ష్మణ్, ముద్దాయిపేట రైతు



యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో..

మెగా హెూమ్, కారు లోన్ మేళా

నవతెలంగాణ-సంగారెడ్డి

దేశంలో అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు శనివారం మల్కపూర్ రోడ్‌లోని తేహెర్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో మెగా హెూమ్‌లోన్, కార్ లోన్ ఎక్స్‌పోను నిర్వహించారు. సంగారెడ్డి, హైదరాబాద్‌లో పేరుగాంచిన బిల్డర్లు, కార్ డీలర్లు, ఎడ్యుకేషన్ లోన్ కన్సల్టెంట్స్ ఈ మేళాలో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వికాస్, రిటైల్ లోన్స్ హెడ్ రమేష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లాలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్లు హాజరయ్యారు. అక్కడే అతి తక్కువ వడ్డీకి లోన్ సాంక్షన్ లెటర్స్‌ను కూడా అందజేశారు. లక్కీ డ్రా నిర్వహించి వచ్చిన వారికి బహుమతులు అందజేశారు.

దివ్యాంగుల కోసం దిక్సూచి యాత్ర



నవతెలంగాణ-హత్నూర

దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా దిక్సూచి యాత్ర నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శివ శంకర్‌రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సదరం క్యాంపునకు వెళ్లి దరఖాస్తులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్న వారి వద్ద నుంచి ఈనెల 3 నుంచి హత్నూర మండలంలో ఇంటింటి సర్వే నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. స్లాట్‌బుక్ చేయడం, సదరన్ క్యాంపునకు వెళ్లడానికి అవ సరమైన బస్సు సౌకర్యం ఉచితంగా కల్పిస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులు 9989778881 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాల సహకారం అందించాలని అధికారిని కోరారు. అనంతరం బొల్లారం మున్సిపల్ నూతన కమిషనర్ మంగతాయారుని చంద్రారెడ్డి కౌన్సిలర్లతో కలిసి సన్మానించారు. మున్సిపల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాల్టీకి అధికారుల రాకపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అనిల్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు సంతోష, సరిత, నిహారిక, జయమ్మ, గోపాలమ్మ, రాధా, చంద్రయ్య, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి





నవతెలంగాణ-హత్నూర

ప్రభుత్వం ధరణి సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోందని.. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హత్నూర మండల తహసిల్దార్ ఫర్హీన్ షేక్ సూచించారు. మండలంలోని కాసాల, చింతల్ చెరువు, దౌల్తాబాద్ తదితర గ్రామాల్లో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి.. తహసీల్దార్ మాట్లాడారు. ధరణి పోర్టల్ వచ్చాక తలెత్తిన భూ సమస్యలు, ఖాతా, సర్వేనెంబర్ మిస్సింగ్, తప్పులు, పట్టాదార్ పేర్లు, ఫోటోల్లో తప్పులు, అలాగే మ్యూటేషన్ సక్సేషన్ తదితర సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి కమిటీ ద్వారా గ్రామంలో పర్యటించి భూ సమస్యలు పరిష్కరించనున్నట్టు చెప్పారు. ఈనెల 9 తారీకు వరకు స్పెషల్ డ్రైవ్ సదస్సులు ఉంటాయని.. అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాసాల ఎంపీటీసీ విజయలక్ష్మి వెంకటేశం గుప్తా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్ రావులకోరి, జూనియర్ అసిస్టెంట్ మనోహర్, చరణ్, ఏఈఓ వరప్రతాప్, పంచాయతీ సెక్రటరీలు నవీన్ రెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్వాల్ జయరాం రెడ్డి వర్ధంతి



రూ.1.2 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

దివంగత మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కొత్వాల్ జయరాం రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను ఆయన కుమారుడు, బీజేపీ నేత ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 14వ వార్డు వినాయకనగర్‌లో రూ.1.2లక్షల తనసొంత నిధులతో ఆనంద్ కృష్ణారెడ్డి సీసీకెమెరాలు ఏర్పాటు చేసి.. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, బిల్లు కలెక్టర్ రఘురాం రెడ్డి, మరోచోట సఫాయి కార్మికులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయకనగర్ కాలనీ వాసులు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారని, దాంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు వచ్చే ప్రమాదం ఉన్నదన్నారు. ఎవరైనా వీధుల్లో చెత్త పడేస్తే జరిమానా విధిస్తామని.. ఇంటి యజమానులు, కాలనీ వాసులు సైతం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. తాను ఓట్ల రాజకీయం చేయటం లేదని, తనకు ఓట్లు వేయకున్న తమ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి జయరాం రెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.

పట్నం రవితేజ పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ



నవతెలంగాణ-సంగారెడ్డి

పీఎంకె ఫౌండేషన్ వైస్ చైర్మెన్, బీఆర్ఎస్ యువ నేత పట్నం రవితేజ పుట్టినరోజు సందర్భంగా శనివారం పీఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి.. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. కాగా పట్నం మాణిక్యం ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆసుపత్రిలో ప్రతీ సోమవారం ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అనాథాశ్రమ విద్యార్థులకు పీఎంకె ఫౌండేషన్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంకె యువసేన నాయకులు మధురాజ్, సాయిబాషా, ప్రదీప్‌గౌడ్, శ్రీ వర్ధన్, కసినిమని, నాని, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో ధరణి స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలో ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల తహసీల్దార్ ఎం.బిక్షపతి తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న అపరిష్కృత ధరణి సమస్యల పరిష్కార నేపథ్యంలో గ్రామాల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టడానికి గాను మొత్తం మూడు బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండల రెవెన్యూ అధికార బృందం, పంచాయతీ సెక్రటరీల బృందాలు, వ్యవసాయ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటారన్నారు. వారం రోజులపాటు ఈ ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపడతారన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి



- ఆర్డీఓ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల ఆందోళన
- సోమవారం రోజున జీతాలు చెల్లిస్తామని, ప్రతీనెలా వచ్చేలా చూస్తామని ఆర్డీఓ, కమిషనర్ హామీ..

నవతెలంగాణ-జహీరాబాద్

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఎమ్మెల్యే ఎలక్షన్ పని బత్తా డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి రెండో రోజు ఆందోళన చేపట్టారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టి.. ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. పెండింగ్ వేతనంతో పాటు, అసెంబ్లీ ఎన్నికల్లో కార్మికులు విధులు నిర్వహించినందుకు ఇచ్చే బత్తా డబ్బులను కూడా ఇవ్వకుండా కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. కాగా ఆర్డీఓ, కమిషనర్‌లు స్పందిస్తూ.. రేపు(సోమవారం) వేతనాలు చెల్లిస్తామని.. చర్చలు జరిపి ఎలక్షన్ అమౌంట్ సమస్య కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతినెలా వేతనాలు చెల్లిస్తామని.. రెండు నెలల వేతనాలు కూడా అడ్వాన్స్‌గా మున్సిపల్‌లో సపరేటు అకౌంట్‌లో ఉంచుతామన్నారు. కాగా రేపటి నుంచి కార్మికులందరూ విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యశోదమ్మ, సంజీవ్, ధన్‌రాజ్, పుణ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి





నవతెలంగాణ-సంగారెడ్డి, జహీరాబాద్

నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ కార్మికుల ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఏజెన్సీపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం. యాదగిరి (మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి), ఎస్. మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు అమలు చేయాలని అడిగినందుకు ముగ్గురు కార్మికులను తొలగించడాన్ని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా చేపట్టగా.. జహీరాబాద్ స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో విధులు బహిష్కరించి కాంట్రాక్టు కార్మికుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ వేధింపులు తట్టుకోలేక ముగ్గురు కార్మికులు ఆత్మహత్య ప్రయత్నం చేశారన్నారు. జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన తర్వాత కూడా వేధింపులకు పాల్పడడం చూస్తుంటే.. కాంట్రాక్టు సంస్థల ఆగడాలు ఎలా మితిమీరి ఉంటున్నాయో అర్థం చేసుకోవచ్చు అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల ఆత్మహత్యాయత్నాలకు కారణమైన కాంట్రాక్టు ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్, శానిటేషన్, స్వీపర్,సెక్యూరిటీ గార్డ్‌ల సంబంధించి కనీస వేతనం రూ.15600 అమలు చేయాలన్నారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లందరూ రింగ్‌గా ఏర్పడి రూ.10,000 లేదా 11,000 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. పీఎఫ్ ఈఎస్ఐలు సరిగా చెల్లించడం లేదన్నారు. కార్మికుల కనీస వేతనం లోంచే వాటిని కట్ చేసి జమ చేస్తున్నారని.. ఇది చాలా అన్యాయమన్నారు. జిల్లా వ్యాప్తంగా నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలు అన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కాంట్రాక్టు ఏజెన్సీల వ్యవస్థల్ని పున సమీక్ష చేయాలన్నారు. నల్గొండ జిల్లాలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని.. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో యూనియన్ నాయకులు యాదగిరి, శోభ, రమాదేవి, మరియమ్మ, హలీమా, మహేష్, యాదయ్య, సునీత, రజిత, శారద, నిఖిత, జహీరాబాద్‌లో సీఐటీయూ హాస్పిటల్ యూనియన్ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఎలిశా, సూపర్వైసర్ గౌస్, నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత విద్యుత్ అందిస్తాం



నవతెలంగాణ-అమీన్‌పూర్

అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని అమీన్‌పూర్ మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్‌రెడ్డి అన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాల అమలు సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపాల్టీలోని శివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. గృహ జ్యోతి, మహాలక్ష్మీ పథకాలు పేద, మధ్య తరగతి కుటుం బాలకు ఎంతగానో మేలు చేస్తుందని తెలిపారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా మద్దతు తెలియజేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ మున్నా, మహిళా కాంగ్రె స్ అధ్యక్షురాలు నిర్మలరమేశ్ యాదవ్, భ్రమరాంబ మల్లికా ర్జునస్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, చేనేత విభాగం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి రమేశ్ నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బిక్షపతికి సన్మానం



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని గడ్డపోతారంలో తహసీల్దార్ బిక్షపతిని గడ్డపోతారం మాజీ సర్పంచ్‌లు పులిగిల్ల ప్రకాశం చారి, ఎంపీ అశోక్ బృందం శనివారం ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గడ్డపోతారం సెక్రటరీ వెంకట్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం



- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- ఓటర్ సంకల్ప పత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-మెదక్: రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో తెలంగాణ ఓటర్ సంకల్ప పత్రం రూపొందించామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో తెలంగాణ ఓటర్ సంకల్ప పత్రాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలు, కళాశాలల్లో ఓటర్ సంకల్ప ప్రతులను విద్యార్థులు వారి తల్లిదండ్రులతో చదివించి సంతకంతో తిరిగి ప్రధానోపాధ్యాయులకు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్త అమలుకు ఆదేశించారన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో విద్యార్థి హామీ పత్రం రూపొందించి విద్యార్థులకు అందజేయడం వల్ల మెదక్ జిల్లాలో మెరుగైన పోలింగ్ శాతం నమోదైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాధాకృష్ణ, డిడబ్ల్యుఓ బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎలక్షన్స్ సూపరిండెంట్ హర్దీప్ సింగ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే పనులు ఆపేస్తాం



- ఏడుపాయల డ్యూటీలు చేయం
- గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్

నవతెలంగాణ-మనోహరాబాద్: గ్రామపంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తికి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే సిబ్బంది కుటుంబం జీవనం ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఏడుపాయల డ్యూటీలు చేయొద్దని కోరారు ఈ నెల 5వ తేదీ నాటికి పెండింగ్ జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో 6వ తేది నుంచి పారిశుద్ధ్య పనులు నిలిపిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరేష్, రాములు, ఆంజనేయులు, శ్రీకాంత్, లక్ష్మణ్, సత్యనారాయణ, బాలమణి, ఎల్లమ్మ నవనీత, పుష్ప పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడు మృతి



నవతెలంగాణ- కొల్చారం

అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన కొల్చారం మండలం పైతర గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ నర్సింలు, అనిత దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు కొండ యాదగిరి (26) గత కొంత కాలంగా కిడ్నీల సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునేవాడు. ఇంతలోనే పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య అరుణ, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆర్థికంగా యాదగిరి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసానిచ్చారు.

గృహ జ్యోతిపథకం అమలు హర్షనీయం

- మైనార్టీ నాయకులు మసూద్ అలీ



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకం మార్చి ఒకటి నుంచి అమలు చేయడం జరిగింది. అందులో భాగంగానే మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో లబ్ధిదారుని ఇంటికి వెళ్లి విద్యుత్ అధికారులు జూనియర్ లైన్మెన్ రమేష్ చేతులమీదుగా జీరో బిల్లు అందజేశారు. మండల మైనార్టీ నాయకులు మహమ్మద్ మసూద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల లోపల ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం గృహజ్యోతి పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. గృహజ్యోతి పథకం అమలు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగ వెంకట్ రాములు, బొజ్జ భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

హెల్ప్ ఏజ్ ఇండియా వారి ఉచిత మెగా వైద్యం



నవతెలంగాణ-చేగుంట

ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని ప్రతి ఒక్కరూ చెప్పిన సూచనల మేరకే మందులు వాడుకోవాలని డాక్టర్ సరళ, ఫార్మసిస్ట్ వినోద్‌లు సూచించారు. చేగుంట ఉమ్మడి మండలం కసన్ పల్లి గ్రామంలో హెల్ప్‌ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వృద్ధులకు బీపి, షుగర్ చెక్ చేసి మందులను అందజేశారు. వృద్ధుల ఆరోగ్యాన్ని పరి రక్షించడమే లక్ష్యంగా హెల్ప్ ఏజ్ ఇండియా గత 4 సంవత్సరాలుగా తూప్రాన్ పరిధిలోని దాదాపు 20 గ్రామాలను కవర్ చేస్తూ వృద్ధులకు సేవ చేస్తుందని ఆ సంస్థ సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నక్క మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీ నేతలు



నవతెలంగాణ-నార్సింగి

మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యెన్నం రాజేందర్ రెడ్డి మూడు వందల మందితో పాటు ఇతర పార్టీలకు చెందిన వారిని కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేలా చేశారు. శనివారం మధ్యాహ్నం రాజేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన మరో ముప్పై మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉపేందర్ గౌడ్, రాధా కృష్ణ శర్మ, సంగెం శ్రీకాంత్‌తో సహా మొత్తం 30 మందిని రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లు పార్టీ కండువాలను కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేసినందుకు కృతజ్ఞతలు

- మైనార్టీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చార్ల సందీప్



నవతెలంగాణ-నర్సాపూర్

మెగా డీఎస్సీ నోటిఫికే షన్ వేసినందుకు నిరుద్యో గుల తరఫున ప్రభుత్వానికి నర్సాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్య క్షులు చార్ల సందీప్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు తప్పకుండా భర్తీ చేస్తుందన్నారు అందులో భాగంగా మొదట విడతగా మెగా డీఎస్సీ ద్వారా 11002 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ వేయడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్లు, బర్లు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కృష్ణ, శ్రీనివాస్, నరసింహ చారి, మహేష్ తదితరులు ఉన్నారు .

దుర్గామాతను దర్శించుకున్న మెదక్ ఆర్డీవో



నవతెలంగాణ-పాపన్నపేట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాతను మెదక్ ఆర్డీఓ రమాదేవి దర్శించుకుని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించి అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. వారి వెంట పాపన్నపేట ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు ఆలయ సిబ్బంది ఉన్నారు.

మహిళలకు బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ

మార్చి 10 నుంచి ప్రారంభం
మనోహరాబాద్ ఏపీఎం పెంటా గౌడ్

నవతెలంగాణ-మనోహరాబాద్

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో నెలరోజుల పాటు ఈ నెల 10 నుంచి ఏప్రిల్ 8 వరకు గ్రామీణ మహిళలకు బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఎం పెంటా గౌడ్ తెలిపారు. ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన మహిళలు 18 సం.ల నుంచి 45 సం.ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. శిక్షణా సమయంలో ఉచితభోజనం, ఉచిత వసతితో ఉచితంగా శిక్షణ, ఉచిత బ్యూటీ పార్లర్ టూల్ కిట్ ఇవ్వనున్నట్లు ఎస్‌బిఆర్ఎస్ ఈటిఐ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ తెలియజేశారని పెంటాగౌడ్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళలు.రేషన్ కార్డ్ జిరాక్స్.ఆధార్ కార్డ్ జిరాక్స్, 10వ తరగతి సర్టిఫికెట్ జిరాక్సు పత్రి, 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు అందజేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9704446956, 9490129839 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ నెల 9వ తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఎం పెంటాగౌడ్ సూచించారు.

నేడు పల్స్ పోలియో

- మూడు రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమం
- జిల్లాలో 75433 మంది చిన్నారులు
- 457 పోలియో బూత్ కేంద్రాలు
- 1056 టీమ్ లు.. 46 రూట్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నవతెలంగాణ-మెదక్

పోలియోరహిత సమాజమే లక్ష్యంగా ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేండ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయనున్నారు. ఆరోగ్య కేంద్రాలు, ప్రయాణ ప్రాంగణాలు, ప్రధాన కూడళ్లు, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మార్చి 3, 4, 5 తేదీల్లో 0-5 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు అధికా రులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా, 157 ఆరోగ్య ఉప కేంద్రాలు, 1,74,534 నివాస గృహాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 20 ట్రాన్సిట్ పాయింట్లు, 176 హైరిస్క్ కేంద్రాలు మొదలగు అన్నింటిలో 457 పోలియో బూత్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1046 టీముల ద్వారా 46 రూట్లలో 1828 వ్యాక్సినేటర్లచే జిల్లాలో నిర్దేశించబడిన 75,433 మంది అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయనున్నారు. మార్చి 3 ఆదివారం రోజున పోలియో బూత్ కేంద్రాలలో చుక్కలను వేయనున్నారు. ఆ తరువాత మార్చి 4, 5 తేదీలలో మిగిలి పోయిన పిల్లలందరికి ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలను వేస్తారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- డాక్టర్ చందు నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మెదక్.



పోలియో రహిత సమాజమే లక్ష్యంగా 3,4,5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0-5 ఏళ్ల లోపు వయస్సు చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. జిల్లా వ్యాప్తంగా 75, 433 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు చుక్కల మందు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

అంగన్వాడీ హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలి

- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ

నవతెలంగాణ-మెదక్

అంగన్వాడీ హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హెల్పర్స్‌కు పాత పద్ధతుల్లో ప్రమోషన్ ఇవ్వాలని హెల్పర్స్ సమస్యలపై జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, ఐసీడీఎస్ పీడీ బ్రహ్మాజీలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ హెల్పర్లకు పాత పద్ధతిలోనే పదవ తరగతి చదివిన వారికి ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. 9 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయని ప్రకటించినందున హర్షం ప్రకటించారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 డిసెంబర్‌లో విద్యార్హతను ఇంటర్‌గా మార్చిందని, ఇది సరైనది కాదన్నారు. హెల్పర్స్‌కు గతంలో ఎస్ఎస్సి విద్యార్హతతో ప్రమోషన్ ఉండేదని, అవే పద్ధతుల్లో ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారని, ఇందులో 35,000 మంది హెల్పర్స్ 45 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. కాబట్టి పాత పద్ధతుల్లోనే హెల్పర్స్‌కు ప్రమోషన్ ఇవ్వాలని, రాష్ట్రంలో మినీ టీచర్స్‌ను ఎలాంటి విద్యార్హత కండిషన్ లేకుండానే మెయిన్ టీచర్స్‌గా ప్రభుత్వం గుర్తించి 4,000 మందికి న్యాయం చేసిందన్నారు. అలాగే అనుభవంతో ఉన్న హెల్పర్లను పదవ తరగతిపై ప్రమోషన్ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదా బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, సాధారణ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరి జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. రాజు, జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శారద, జిల్లా ఉపాధ్యక్షులు బి.కవిత, వనపర్తి ప్రాజెక్టు అధ్యక్షులు జ్యోతి, కార్యదర్శి సుమతి, జిల్లా కోశాధికారి పెద్దేరు ప్రాజెక్టు అధ్యక్షురాలు రాధా, హెల్పర్స్ నాయకులు శ్యామల, ప్రమీల, వజ్రమ్మ ఎల్లమ్మ, మహేశ్వరీ, జయ, సీతమ్మ, బుజ్జమ్మ వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు గృహ జ్యోతిని అమలు చేయాలి

నవతెలంగాణ-చేగుంట

రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత గృహజ్యోతి అందించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోరారు. మండలంలోని ఇబ్రహీంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ విలేకర్లతో మాట్లాడుతూ 2019 నుంచి ఉద్యోగ ఉపాధ్యాయులకు మొదటి తారీకు జీతాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి తారీకున జీతాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. గృహజ్యోతి పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలకు వర్తింపచేసి, ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యుత్ పాత బకాయిలను రద్దు చేయాలని,గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ పది సంవత్సరాల వెనుక్కు వెళ్లిందని, ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మాణం చేపట్టకుండా వదిలి వేసిందని ఆరోపించారు. నూతన ప్రభుత్వం మన ఊరు మన బడిలో మంజూరైన అన్ని పనులు త్వరగా పూర్తి చేసి, పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి రేఖ, తపస్ జిల్లా ఉపాధ్యక్షులు చక్రవర్తి, తపస్ నాయకులు అల్లం ఆంజనేయులు, మురళీ కృష్ణ, శంకర్, రజిత, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-టేక్మాల్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలకు వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు కంది భాస్కర్ అన్నారు. శనివారం టేక్మాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఏడు ప్రాథమికోన్నత, 34 ప్రాథమిక, ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలకు, ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలకు, తెలంగాణ మోడల్ పాఠశాలకు వర్తింపజేస్తే సుమారు 3000 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. తద్వారా విద్యార్థులకు కంప్యూటర్ విద్యతోపాటు, రేడియో పాఠాలు, మనబడి పాఠశాల శ్రద్ధగా వినేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వానికి విన్నవించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, చక్రపాణి, సర్దిన కృష్ణలు ఉన్నారు.



అదుపు తప్పిన బైక్ పొలాల్లో తిరగబడి వ్యక్తి మృతి



నవ తెలంగాణ-టేక్మాల్

బైక్ అదుపుతప్పి పొలాల్లో తిరగబడి ఓ వ్యక్తి మృతి చెందిన సం ఘటన మండల పరిధి లోని ఎ క్లాస్ పూర్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్ గ్రామానికి చెందిన తలారి శివకుమార్ (32) టేక్మాల్ తహశీల్దార్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో ఏ క్లాస్ పూర్ గ్రామం మూల మలుపు వద్ద బైకు అతివేగంగా నడపడంతో కంట్రోల్ తప్పి పక్కనే ఉన్న వరి పొలంలోకి వెళ్లి తిరగబడి బైక్ కింద పడి ఊపిరాడక శివకుమార్ మృతి చెందినట్లు ఏఎస్ఐ తుక్కయ్య తెలిపారు. శవాన్ని వెలికి తీసి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



జీరో బిల్లు కరెంటు చారిత్రాత్మకం



నవతెలంగాణ-కొల్చారం : 200 యూనిట్ల వరకు జీరో బిల్లు కరెంటు ఉచితంగా ఇవ్వడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంమైన కొల్చారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గృహ అవసరాల నిమిత్తం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీరో బిల్లు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు అమలుపరచడం సంతోషకరమన్నారు. అంతేకాకుండా 6 గ్యారంటీల అమలు దిశగా ప్రభుత్వం ముందుకు పోవడం గర్వపడుతున్నామన్నారు. గత పాలకులు ఇచ్చిన హామీలను పదేళ్ల అధికారంలో ఉండి కూడా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా గాలికి వదిలేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. గొర్రెలు, బర్రెలు, చేపల చెరువులు అనుకుంటూ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవన్న గారి శేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, కొల్చారం గ్రామ శాఖ అధ్యక్షులు మాజీ సర్పంచ్ ఆశన్నగారి శ్రీశైలం, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అక్రం, నాయకులు డాక్టర్ బాలరాజ్, గంధం కృష్ణ, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం





నవతెలంగాణ-పాపన్నపేట: పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగరావు పల్లి తండా ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. డీఈవోగా అనిల్, ఎంఈఓ గా దీక్షిత, హెచ్ఎంగా అర్చన, ఉపాధ్యాయులుగా కార్తీక్, బబ్లు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుర్తివాడ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, భట్టు నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ , ఉపాధ్యాయుడు చిరంజీవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -పాపన్నపేట: విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాపన్నపేట మండలం నార్సింగి శ్రీ సాయి స్కూల్లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నిన్న, మొన్నటి వరకు అందరితో కలిసి చదువుకొన్న విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్కూల్లో చిన్నారులు బోదించిన తీరు అందరిని అకట్టుకుంది. ఇందులో భాగంగా డీఈవోగా హరీశ్ రెడ్డి, ఎంఈవోగా హరీశ్వర్, ప్రిన్సిపాల్‌గా వర్షిత్, ఉపాధ్యాయులుగా అవంతిక, శృతి, భావన, ఆరాధ్య, నిహారిక, మైథిలి, సహస్ర, సమిత, శివ, సంజయ్, అఫ్రోజ్, నిఖిల్ వ్యవహరించారు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్య ం భాస్కర్, నరేష్, మహేష్, శివ, పాఠశాల ఉపాధ్యాయులు వినోద్, శ్రావణి, లత, రాజ్యలక్ష్మీ, సింధూర, సభ, నవ్య, మంజుల, వందన బహుమతులు అందజేశారు



నవతెలంగాణ-టేక్మాల్: మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 7వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా చక్కని ప్రతిభను కనబర్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌గా ఎం.అశ్విని. ప్రధానోపాధ్యాయులుగా ఎం.హర్షవర్ధన్. డిఈఓ గా, ఎం తేజస్విని, ఎంసిఓగా కే దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులుగా అక్షరా, వైష్ణవి, కృష్ణవేణి, వర్షిని, సాయికుమార్, భరత్, రామ్ చరణ్, అవినాష్‌లు ఉపాధ్యాయులుగా తమ ప్రతిభను కనబరిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షహీన్ సుల్తానా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ఉపాధ్యాయుల బాధ్యత గురించి వారి గొప్పతనాన్ని విద్యార్థులకు సూచించారు. మంచి విద్య బోధన చేసిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు బహుమతి ప్రధానం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సి.హెచ్. అనిల్, విజయ సారథి. దుర్గా ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



నవతెలంగాణ-నార్సింగి

బీఆర్ఎస్ పార్టీకి మండలంలో భారీ షాక్ తగిలింది. ముఖ్య నాయకులతో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు, కుల సంఘాల వారు దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం నార్సింగి పట్టణ కేంద్రంలోని రెడ్డి సంఘంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యెన్నం రాజేందర్ రెడ్డి, సంపత్ రెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాదాపు మూడు వందల మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో రాజేందర్ రెడ్డితో పాటు సంపత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సిద్దు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఎండీ బాఖర్ పాషా, పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రాల స్వామి, పంచాయితీ వార్డు మాజీ సభ్యురాలు పోచమ్మ, వంజరి సంఘం మాజీ అధ్యక్షుడు యేమికే రాజు, శంకర్ వంటి ముఖ్య నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం చేపట్టిన రెండు నెలల్లో ఇచ్చిన ఆరు హామీలలో 4 హామీలను అమలు పరిచామన్నారు. మిగతా 2 హామీలను కూడా త్వరలోనే అమలు పరుస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి తప్ప వేరే అభివృధి కనబడడం లేదని, గత 10 సంవత్సరాలలో బీఆర్ఎస్ మాటలు తప్ప పనులు చేయలేదన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరామని మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, తెలంగాణ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు స్వామి బాచి, ఫిషర్మేన్ అధ్యక్షుడు సుధాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జప్తి శివనూర్ మాజీ ఉప సర్పంచ్ రుక్ముద్దీన్, సీనియర్ నాయకులు సీతయ్య రవి, రవీందర్, మల్కయ్య సుభాష్ రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిఎంఆర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన

నవతెలంగాణ -మనోహరాబాద్

తూప్రాన్ టోల్ ప్లాజా దగ్గర డుకాటి బైక్ ఓనర్స్ క్లబ్ సభ్యులు సందడి చేశారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ రోడ్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన బైక్ ర్యాలీ లో హైదరాబాద్ నుంచి వచ్చిన డుకాటి క్లబ్ సభ్యులు స్థానిక యువతతో కలిసి పాల్గొన్నారు. తదనంతరం రెండు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. మనోహరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో రోడ్డు భద్రతపై నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేయగా తూప్రాన్ వద్ద ఎంజెపి బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినులకు పరీక్షా సామాగ్రిని అందచేశారు. డుకాటి బైక్ స్వంతదారులమైన తామంతా కలిసి ఏదైనా సామాజిక కార్యక్రమంలో పాలుపంచుకోవాలనే ఉద్దేశంతో జీఎంఆర్ సంస్థతో కలిసి ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు డుకాటి క్లబ్ ప్రతినిధి స్వెన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ హైవే ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట రమణ, సిబ్బంది పరంధామన్‌తో పాటు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు కోడె భారతి, శ్రీనివాస్, పోచాలు, రక్ష సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని మహమ్మదాపూర్ గ్రామంలో వడ్డెర కాలనీలో నీటి సమస్య కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు శనివారం వడ్డెర కాలనీలో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంకుకు ఎంపీపీ లకావత్ మానస, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు భూమి పూజ చేశారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం రూ.20 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క ఆడబిడ్డ కూడా ఈ ఎండాకాలంలో నీటి బిందెతో బయటికి వెళ్లొద్దని దృఢ సంకల్పంతో మంత్రి పొన్నం ప్రభాకర్ పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఆర్ డబ్ల్యూ ఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రుహినా తస్కీన్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ.ఈ మమత, ఎంపీడీవో వేణుగోపాల్, పిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు, గ్రామ శాఖ అధ్యక్షులు సంఘ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పై అవగాహన తప్పనిసరి

నవతెలంగాణ- దుబ్బాక : భారత రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు భీమ్ శేఖర్ అన్నారు. డీబీఎఫ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం బహుమతులను అందజేయడం జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు సంజీవ్ ఉపాధ్యాయులు ఉన్నారు.



రికార్డుల తనిఖీ అనుమతికి సీసీఆర్ సంస్థ దరఖాస్తు

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు సంబంధించి ఆర్టీఐ చట్టం ద్వారా రికార్డుల తనిఖీ చేయడానికి కౌన్సిల్ ఫర్ సిటీజేన్ రైట్స్ సంస్థకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ఆ సంస్థ ప్రతినిధిలు శ్రీనివాస్, గుండ్ల శివచంద్రం శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణికి దరఖాస్తు అందించారు. ఈ సందర్భంగా సీసీఆర్ సంస్థ జిల్లా అధ్యక్షులు గుండ్ల శివచంద్రం, స్టేట్ మీడియా కో ఆర్డినేటర్ సాజిద్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవకులని, వారు పారదర్శకంగా ఉంటేనే ప్రజలకు అత్యుత్తమ సేవ అందించవచ్చన్నారు. అవినీతికి తావు లేకుండా, పారదర్శక పాలన అందించాడనికే ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని కూకటివేళ్ళతో పెకిలించడానికి కౌన్సిల్ ఫర్ సిటీజేన్ రైట్స్ సంస్థ పనిచేస్తోందని అన్నారు. ఆర్టీఐ చట్టం



సామాన్యుల చేతిలో బ్రహ్మాస్త్రం అని, చట్టాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులను ప్రతి ఒక్క భారత పౌరులు తనిఖీ చేసుకునే అవకాశాన్ని భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టం ద్వారా కల్పించిందని అన్నారు.

జిల్లా కలెక్టర్ ను కలిసిన సీసీఆర్ సంస్థ సభ్యులు

సిద్దిపేట జిల్లా నూతన కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని శనివారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సిద్దిపేట జిల్లాలో నిర్మితమైన మల్లన్నసాగర్ రిజర్వాయర్లు ముంపునకు గురైన ప్రజలకు ఇప్పటివరకు సరైన న్యాయం జరగలేదని, నాలుగు సంవత్సరాల నుండి కొంతమంది ఇంకా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల కోసం ఇతరత్రా పరిహారాల కోసం వేచి చూస్తున్నారని, దీనిని త్వరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముంపు బాధితులందరికీ న్యాయం చేయవలసిందిగా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సంపత్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ డిపోను పర్యవేక్షించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ బస్ స్టేషన్ ఆధునీకరణ ,శంకుస్థాపన పనుల పర్యవేక్షణ కోసం కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్, సిసిఈ శ్రీనివాస రావు శనివారం హుస్నాబాద్ బస్టాండ్, డిపోను పర్యవక్షించారు. బస్టాండ్ లో ప్రయాణికులకు సౌకర్యాలు, బస్సుల యొక్క పని తీరు పై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హుస్నాబాద్ డిపోలో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం, సివిల్ ఇంజనీర్, డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దూల్మిట్ట తహసీల్దారుగా శ్యామ్



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట తహసిల్దార్ గా వై శ్యామ్‌ను నియమించినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. దూల్మిట్ట తహసిల్దార్ గా విధులు నిర్వర్తిస్తున్న వి శ్రీనివాసరెడ్డి ని బెజ్జంకి మండలానికి బదిలీపై వెళ్లగా బెజ్జంకి మండలంలో తహసిల్దార్ గా విధులు నిర్వర్తిస్తున్న వై శ్యామ్ దూల్మిట్ట తహసిల్దారుగా బదిలీపై వచ్చారు

వంద ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

జిల్లాలో పదవ తరగతిలో ప్రతి పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ మండలం అహ్మది పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులతో పాటు పదో తరగతి విద్యార్థులకు ఆయన ముచ్చటించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదవాలని తల్లిదండ్రులు సైతం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. మధ్యాహ్న భోజనంపై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి సంతృప్తి చెందారు. అనంతరం ఆయనను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

తడి పొడి చెత్త బుట్టలను పంపిణీ చేసిన చైర్మన్



నవతెలంగాణ -హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని 15వ వార్డు ప్రజలకు శనివారం మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత తడి చెత్త పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత మాట్లాడుతూ ప్రజలందరూ బుట్టలను ఉపయోగిస్తూ మున్సిపల్ వాహనానికి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా అందించాలని కోరారు. ఇండ్లను పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, ఐలేని శంకర్ రెడ్డి,యండి ఆయూబ్ , వాలా నవీన్ రావు, వార్డ్ ఆఫీసర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తును చక్కదిద్దుకోవాలి

డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు



నవతెలంగాణ-తొగుట

భారత రాజ్యాంగం గురించి తెలుసుకొని భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు తెలిపారు. శనివారం మండలంలోని వెంకట్రావుపేట ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రి బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని డిబిఎఫ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలై 74 సంవత్సరాలవుతున్నా నేటికీ చాలామందికి రాజ్యాంగం గురించి తెలియ క పోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మూఢనమ్మకాల నిర్మూలన

విద్యార్థి చేతిపై మంటలు

ఎస్.ఎస్.ఎఫ్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్

నవ తెలంగాణ -మిరు దొడ్డి

విద్యతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ నాయకుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. సిద్దిపేట్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు భూంపల్లి ఎస్సై భువనేశ్వర్ రావు ఆధ్వర్యంలో. అక్బర్ పేట మండల పరిధిలోని ఎనగర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి నరేష్ హాజరై మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని. స్వాములు భూత వైద్యుల పేరుతో కొంతమంది ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా మోసం



చేస్తున్నారని అన్నారు. దయ్యాలు భూతాలు మంత్రాలు బూటకమని. సైన్స్ ను సైనికుడిలా విద్యార్థులు ముందుకు నడవాలని. విద్యార్థి దశలోని ఉన్నత చదువులతో మీతల్లిదండ్రుల లక్ష్యాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్ తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం, లాంటి అనేక ప్రదర్శనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాల మల్లయ్య, హెచ్ఎం అంజయ్య,పోలీస్ సిబ్బంది అధ్యాపక బందం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కబడ్డీ క్రిడాకారులకు ట్రాక్ సూట్‌ల పంపిణీ

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివ కుమార్

నవ తెలంగాణ - సిద్దిపేట : నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ లో తెలంగాణ రాష్ట్ర 70వ సీనియర్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలకు వెళ్తున్న సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టుకు జడ్పిటిసి కొండల్ రెడ్డి ట్రాక్ షీట్లను అందజేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల శిక్షణ పొందిన సమయంలో గిరి కొండల్ రెడ్డి క్రిడాకారులకు భోజన



కల్పించడంతో పాటు, క్రిడాకారులకు ట్రాక్ సూట్ లను అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, శ్రీకాంత్, మహేష్, నరేంద్ర బాబు, కరుణాకర్ పాల్గొన్నారు.

లచ్చపేటలో ఘనంగా మార్కండేయ వార్షికోత్సవ వేడుకలు

నవ తెలంగాణ- దుబ్బాక



దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో శనివారం పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో మార్కండేయస్వామి 28వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, అర్చనలు,హెూమము విశేష వైదిక కార్యక్రమాలు నిర్వహించినట్లు పద్మశాలి సమాజం అధ్యక్షులు బడుగు రాజు తెలిపారు. ఈ వేడుకల్లో 10, 11 వార్డుల కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య,నందాల శ్రీజ శ్రీకాంత్,మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గిరిధర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలి సమాజం పెద్దలు తాళ్ల లక్ష్మీనర్సయ్య, ఎర్రగుంట ప్రసాద్, శ్రీనివాస్, పాండురంగం, కమిటీ సభ్యులు తడక చిన్న దుబ్బయ్య, గౌరీనాథం, చెలిమెల్ల రాజేశం, కొండ శంకర్, బిళ్ళ రవికుమార్,కూరపాటిరవికాంత్, వెంకటేష్, బోడ అరుణ్, నక్క బాలరాజు, కారంపూరి మోహన్, యువజన సంఘం నాయకులు, పలువురు పాల్గొన్నారు.

అక్షర పాఠశాలలలో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ -జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో గల అక్షర పాఠశాలలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గజ్వేల్ ఒమెగా కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో అక్షర పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. జగదేవపూర్ ఎస్ ఐ చంద్రమోహన్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులకు మాత్రమే కాకుండా తల్లిదండ్రులకు కూడా వైద్య సేవలు అందించడం మంచి ఆలోచన విధానం అని కొనియాడారు. నేత్రాలు బాగా పనిచేస్తేనే వ్యక్తి జీవితాన్ని చక్కదిద్దుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థుల కంటి సమస్యలను చిన్నతనంలోనే గుర్తించి తగిన వైద్యం అందిస్తేనే భవిష్యత్తులో కంటి సమస్యలను దూరం చేసినవారు అవుతారని తెలిపారు. మెగా ఆసుపత్రి గజ్వేల్ కంటి వైద్య నిపుణులు



డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని టి.వి ని దూరం నుంచి మాత్రమే కొద్దీ సమయం మాత్రమే చూడాలని తెలిపారు. సుమారు 400 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ రామస్వామి, ప్రిన్సిపాల్ సంతోషి జ్యోతి రెడ్డి ,వైస్ ప్రిన్సుపాల్ సుదర్శన్ పాఠశాల సిబ్బంది రేణుక,మెగా ఆసుపత్రి సిబ్బంది శ్రవణ్ కుమార్, సాయికృష్ణ, సురేష్, నిర్మల, మంగ ఉపాధ్యాయ. బృందం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన ఉపాధ్యాయ దంపతులు

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట జిల్లాకు చెందిన జీవో 317 బాధిత ఉపాధ్యాయ దంపతుల ప్రతినిధుల బృందం శనివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హరికష్ణ అధ్వర్యంలో కలసి వినతి పత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ 317 జీవో అమలు తర్వాత ఏర్పడిన సమస్యల గురించి వివరించి, 13 జిల్లాల ఉపాధ్యాయ దంపతుల బదిలీలను చేపట్టాల్సిందిగా కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం జీవో 317 బాధితుల



పట్ల సానుకూలంగా ఉందని, దాని కోసం మంత్రివర్గ ఉపసంఘంను ఏర్పాటు చేశామని, బాధితులందరికి త్వరలోనే న్యాయం చేస్తామని తెలిపారని తెలిపారు.

వరకట్న వేధింపులు భరించలేక యువతి ఆత్మహత్య

ఏసీబీ బాలాజీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

నవ తెలంగాణ దౌల్తాబాద్




వరకట్న వేధింపులు భరించలేక మహిళా ఆత్మహత్య చేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి .గ్రామానికి చెందిన మధుర గళ్ళ రేఖను (ముబారస్ పూర్ గ్రామానికి చెందిన చాతకింది బాలవ్వ ఎల్లం దంపతులకు రెండో సంతానం రేఖ) ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రాజవ్వ చంద్రయ్య దంపతుల కుమారుడు బాబుతో వివాహం జరిపించారు. కట్నం



కింద ద్విచక్ర వాహనం అందజేశారు. కొంతకాలంగా తల్లిగారింట్లోనే ఉంటున్న రేఖ మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని కర్నాల్ పల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద శుభకార్యంలో పాల్గొని సాయంత్రం తన సోదరుడు ద్విచక్ర వాహనంపై అత్తగారింటికి వచ్చింది. అన్న తిరిగి వెళ్లిన వెంటనే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దౌల్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దాంతో పాటు జహీర్ నిర్వహించారు ఉప్పరపల్లిలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా గజ్వేల్ ఏసిపి బాలాజీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవ తెలంగాణ - సిద్దిపేట

హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును మర్యాద పూర్వకంగా కలిసినట్లు సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు కలీమోద్దీన్ అహ్మద్, సిద్దిపేట జిల్లా సీనియర్ నాయకులు ఆత్మ రాములు ఉన్నారు.

అభయజ్యోతి మానసిక వికలాంగులకు అన్నదానం

నవ తెలంగాణ - సిద్దిపేట

వాసవి క్లబ్స్ వారి ఆధ్వర్యంలో చిలువేరు అనురాధ పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో అభయజ్యోతి మానసిక వికలాంగుల విద్యాలయంలో విద్యార్థులకు అల్పాహారము , అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కొండూరి మాధవి, కోశాధికారి చింత రజని, యూత్ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి హరికిరణ్, ప్రధాన కార్యదర్శి తోట విశ్వం, శివకుమార్, ముఖేష్, వీరేశం, బాలకిషన్, నీరజ, గాయత్రి, ఉపాధ్యాయుడు జోజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపాదరావు జయంతి

నవ తెలంగాణ - సిద్దిపేట

మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి

మున్సిపల్ ఆఫీసులో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, హరితహారం స్పెషల్ ఆఫీసర్ ఐలయ్య, ఏ ఈ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట తహసిల్దార్ కార్యాలయాన్ని శనివారం జనగామ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా ఫారం 06, 07, 08 ల నమోదు ప్రక్రియను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఓటర్ లిస్టులో చేర్పులు. మార్పులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్యామ్, ఆర్ఐ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు

మల్లన్నసాగర్ కాలనీ పాఠశాలను సందర్శించిన డీఈఓ

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మల్లన్న సాగర్ కాలనీలో ఉన్న పాఠశాలను సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. శనివారం స్థానిక పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థుల విద్యాభ్యాసం పై ఆర తీశారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులను మెరుగుపరిచేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు చర్యలను ఉపాధ్యాయులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించినందుకు, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి దూల్మిట మండలంలోని జాలపల్లి గ్రామంలో యూత్ కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చెట్యూరి కమలాకర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటపై కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. నిరుద్యోగుల కోసం 11 వేల ఉపాధ్యాయ పోస్టుల కోసం మెగా డిఎస్సి ని ప్రకటించినట్లు ఆయన తెలిపారు.మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మీర్జాపూర్ లో రూ.20 లక్షల సిసి రోడ్డు ప్రారంభించిన ఎంపీపీ



నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.20 లక్షల సిసి రోడ్డు పనులను శనివారం హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తరాల లత మహేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంకచందు, పిసిసి సభ్యుడు కేడం లింగమూర్తి , చిత్తారి రవీందర్, మాజీ సర్పంచ్ మడప జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ లో గ్రూప్-1 ప్రిలిమ్స్ కు ఉచిత శిక్షణ

నవ తెలంగాణ - సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్ లో గ్రూప్ 1 ప్రిలిమ్స్ కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ దయాసాగర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రూప్-1 నిరుద్యోగులు ఉచిత శిక్షణ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, ఈ నెల 7 లోపు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా డిగ్రీ(50 శాతం) మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలనీ, కులం, ఆదాయం, ఆధార్ కార్డు మరియు పాసు పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థి యొక్క తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ 5 లక్షలకు మించకూడదనీ, గ్రూప్-1 అక్నాలజీ మెంట్ ఫామ్ తప్పనిసరనీ, ఆర్ ఓ ఆర్ ప్రకారం అభ్యర్థులను ఎంపిక జరుగుతుందనీ తెలిపారు. మరింత సమాచారం కోసం ఆఫీస్ వేళల్లో 08457-224941,9966673095 ను సంప్రదించాలని సూచించారు.

పోతారం ఎస్ లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

నవతెలంగాణ -హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో ఈనెల తొమ్మిదో తేదీ నుండి పదో తేదీ వరకు సిద్దిపేట జిల్లా స్థాయి, ఇతర జిల్లాల ఆహ్వానిత కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు కబడ్డీ నిర్వాహకులు కృష్ణ తెలిపారు. ఆసక్తిగల కబడ్డీ క్రీడలు ఈనెల 8వ తేదీ సాయంత్రం వరకు కబడ్డీ క్రీడ జట్టు పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. పేరు నమోదుకు ఎంట్రీ ఫీజు లేదని, క్రీడా జట్లకు భోజన వసతి కల్పిస్తామన్నారు. విజేతగా నిలిచిన జట్లకు ట్రోఫీతో పాటు రూ 20 వేల నగదు, రెండవ స్థానం ట్రోఫీ తోపాటు రూ .15000 నగదు , మూడో స్థానం ట్రోఫీ, రూ.10000 4 స్థానం ట్రోఫీ , రూ.5000 రూపాయలు నగదు అందిస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9010 373 752 , 9989050283, 9951340634 ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పని చేసిన వారిని విధుల నుండి తొలగించాలి

నవ తెలంగాణ - సిద్దిపేట

ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఇంగ్లీష్ టీచర్ సునీత, సి ఎస్ రవి, డి ఓ రాజు , ఆమెకు సహకరిసున్న డి ఐ ఈ ఓ సూర్యప్రకాష్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఏఐ పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె కుమార్, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ చిన్నకోడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ టీచర్ గా పని చేస్తున్న సునిత ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం సబ్జెక్ట్ టీచర్ కళాశాలలో కి రాకూడదని, అలాగే పరీక్ష జరిగే గదుల్లోకి వెళ్ళకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ శుక్రవారం పరీక్ష సమయంలో ప్రతి పరీక్ష గదికి వెళ్లి విద్యార్థులకు సహకరించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు.

పోలియో చుక్కలు వేయించాలి

: వైద్యాధికారి డాక్టర్ రాధాకిషన్

నవతెలంగాణ-తొగుట

ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని వైద్య అధికారి డాక్టర్ రాధకిషన్ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. మండలంలోని 5 సంవత్సరాల లోపు వయసు గల సుమారు 2556 మంది చిన్నా రులకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించి వారిని అంగవైకల్యం నుంచి కాపాడాలని అన్నారు. పోలియో చుక్కలు వేయడానికి ప్రతి గ్రామంలో పోలియో బూత్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండ ల వ్యాప్తంగా 28 బూత్ లు, ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేశామన్నారు. 4, 5 తేదీలలో ఇంటివద్ద మిగిలిపోయిన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తారని అన్నారు.

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు

నవతెలంగాణ-వర్గల్

ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని వర్గల్ మండల వైద్య అధికారి డాక్టర్ హరిత అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసామని అన్నారు.మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మండల కేంద్రంలో స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

మూగజీవుల సేవలో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్

జిల్లా అధ్యక్షులుగా గోపాల్ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-మెదక్

మూగజీవాలకు పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని టిఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ కొనియాడారు. శనివారం స్థానిక టీఎన్జీవో భవన్లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ వ్యాధుల బారిన పడిన పశువులకు మెరుగైన వైద్యం అందిస్తూ, సమయానికి వివిధ రకాల వ్యాక్సిన్లను ఇస్తూ వ్యాధుల బారిన పడకుండా పశువులను సంరక్షిస్తున్న ఉద్యోగులు ధన్యులన్నారు. విఎల్వోలకు గెజిటెడ్ హెూదా కోసం కేంద్ర సంఘంపై ఒత్తిడి తెస్తామన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూనే టిఎన్జీవో సంఘం తలపెట్టే కార్యక్రమాల్లో కీలక భాగస్వామ్యం కావాలన్నారు. భవిష్యత్‌లో నూతన పెన్షన్ విధానం, కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ విధానం రద్దు మరియు ఆదాయ పన్ను పరిమితి పెంపు తదితర సమస్యలపై సంఘటితంగా పోరాడి సాధించుకునే బాధ్యత భుజాన వేసుకుందామన్నారు. రాబోయే తరాలకు ఉద్యోగవర్గాన్ని అందించి మార్గదర్శకత్వం కావాలన్నారు. అనంతరం నూతనంగా ఏకగ్రీవ ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించి జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు బింగి సురేష్, కార్యదర్శి అభిషేక్‌లతో కలిసి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పశుసంవర్ధక శాఖ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆవిష్కరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి. గోపాల్, కార్యదర్శిగా లింగమూర్తి, సహాధ్యక్షులు హరి శంకర్, కోశాధికారిగా రాకేష్, ఉపాధ్యక్షులుగా సుదర్శన్, వీరారెడ్డి, రాజ్ కుమార్, మంజుల, సంయుక్త కార్యదర్శులుగా విశ్వనాథం, చెన్నయ్య, కిషోర్ కుమార్, భాగ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విజయ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా గట్టయ్య, క్రీడల కార్యదర్శిగా సురేష్, కార్యవర్గ సభ్యులుగా ఇబ్రహీం, రామకృష్ణ, మహేందర్ రెడ్డి, రాజులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు పజాలుద్దీన్, సంయుక్త కార్యదర్శి శివాజీ, అల్లాదుర్గ్ యూనిట్ అధ్యక్షులు ధర్మాచందర్, పశుసంవర్ధక శాఖ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రతన్, కార్యవర్గ సభ్యులు నరేష్, భానుచందర్, ఆంజనేయులు, రాజారామ్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

దుద్దిళ్ళ శ్రీపాదరావుకు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నివాళి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన దుద్దిళ్ళ శ్రీపాదరావు 87వ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన గావించి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ తిరుపతినాయక్, కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్, డిపిఆర్ఓ కార్యాలయ టైపిస్టు రాములు, రికార్డ్ అసిస్టెంట్ మల్లికార్జున్, ఇతర అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెక్కల్ రామలింగేశ్వర స్వామి పాలకవర్గం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-మద్దూరు

దూళ్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ చొప్పరి మల్లేశం, డైరెక్టర్లు ఇమ్మడి శోభ పురుషోత్తం రెడ్డి, ధరావత్ సరిరామ్, చెన్నోజు బ్రహ్మాచారి, రాజపేట మల్లేశం, స్వర్గం సాంబయ్యలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడు, కొమరవెల్లి దేవస్థానం చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. .కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని వారన్నారు. పాలకవర్గ సభ్యులు నిస్వార్థంతో సేవ చేయాలని వారు కోరారు. పాలకవర్గ సభ్యులను కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహదేవుని శ్రీనివాస్, కామిడీ జీవన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సందడి లక్ష్మి, ఆరే సాయిలు ,కోల సాయిలు, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

నిండు ప్రాణానికి రెండు చుక్కలు

- నేడే పల్స్ పోలియో
- మండలంలో 1835 పిల్లలకు పల్స్ పోలియో వ్యాక్సిన్
- 23 బూత్ లు,మొబైల్ టీంలతో వ్యాక్సిన్ పర్యవేక్షణ
- వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

దేశ వ్యాప్తంగా నేడు పల్స్ పోలియో కార్యక్రమం జరగనుంది. చిన్నారుల నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పల్స్ పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. ఇందుకోసం 0-5 ఏండ్ల వయస్సుగల చిన్నారులకు విధిగా రెండు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత అందరిపైన ఉంది.ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య శాఖాధికారులు తెలిపారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 23 పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను వైశ్యశాఖాధికారులు ఏర్పాటు చేశారు. మొబైల్ టీంలతో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు పర్యవేక్షించనున్నారు. మండలంలో 1835 (బెజ్జంకి-1029,తోటపల్లి 806) మంది చిన్నారులుండగా బెజ్జంకి,తోటపల్లి ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం అందుబాటులో లేకుండా పోలియో చుక్కలు వినియోగించుకోలేని చిన్నారులకు మరుసటి రోజు నుండి గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి పూర్తి స్థాయిలో పోలియో చుక్కల పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నారు.

పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి : వినోద్ బాబ్జీ, వైద్యాధికారి బెజ్జంకి.

మండలంలోని బెజ్జంకి,తోటపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో(0-5) వయస్సు గల పిల్లలకు పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి



చేశాం.ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలియో కార్యక్రమం చేపట్టాం. అందుబాటులో లేకుండా సద్వినియోగం చేసుకోలేనివారికి తదుపరి రోజు నుండి ఇంటింటా పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతాం.

తీవ్ర అనీమియాతో బాధపడే రోగులకు కౌన్సిలింగ్

- వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

తీవ్ర అనీమియాతో బాధపడుతున్న కేసులను గుర్తించి వారి ఇండ్లకు వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య ప్రగతి నివేదికను జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా ఆరోగ్య సమన్వయకర్త డాక్టర్ సాయికిరణ్ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జరిగే ఆరోగ్య కార్యక్రమాలను, వైద్యం అందించే విధానాలను, పరిస్థితులను తెలియజేశారు. గవర్నమెంట్ జిల్లా ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గూర్చి ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ వివరించారు. ఈ సమావేశంలో



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా తీవ్ర అనీమియాతో బాధపడుతున్న బాలబాలికలకు ఆర్బిఎస్కే సిబ్బంది వారి ఇంటికి వెళ్లి పోషకాహారం వైద్య విధానాల గురించి మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో మాతృమరణాల పై థర్డ్ పార్టీ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలో టీబీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ లో గత సంవత్సరం నుంచి జరిపిన పరీక్షల వివరాలను అందించాలన్నారు. గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి లో హెల్ప్ డెస్కును పటిష్ట పరిచాలన్నారు. జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న డ్యూటీ డాక్టర్ల రోస్టర్ జాబితాను అందించాలని కోరారు.



సీఎస్సి లలో డెలివరీలు మెరుగుపరచాలని కలెక్టర్ కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆసుపత్రులలో మౌలిక వసతులు రోగులకు అవసరమయ్యే పరికరాలకు తక్కువ ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. "ప్రతిసారి రెండు చుక్కలు పోలియో పై నిరంతరంగా విజయం" టాగ్ లైన్ తో కూడిన గోడ పత్రికను, ఫ్లెక్సీని కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే 0-5 సంవత్సరాల వయసు గల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేపించేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ లు, లైసన్ అధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జాలపల్లిలో ఇసుక డంపులు పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-మద్దూరు

దూళ్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో ఇసుక అక్రమ డంపులను చేర్యాల సిఐ శ్రీను, మద్దూరు ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీలు శనివారం పట్టుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం జాలపల్లి వాగు నుండి కొంతమంది వ్యక్తులు కలిసి. ఇసుకను అక్రమంగా డంపు చేసి అమ్మడానికి అక్రమ ఇసుక డంపు ఉంచారని నమ్మదగిన సమాచారం రావడంతో వెళ్లి చూడగా అక్కడ ఇసుక డంపు ఉన్నదని. వెంటనే రెవెన్యూ అధికారులను పిలిపించి వారికి అప్పగించినట్లు వారు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక డంపు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ జిరాక్స్ మిషన్ అందజేత



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన బత్తిని సత్తయ్య కళావతి, దంపతులు పాఠశాలకు 30000 రూపాయల విలువగల కంప్యూటర్, ప్రింటర్ జిరాక్స్ మిషన్‌ను అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ గ్రామానికి సేవ చేయాలనే తపనతో పాఠశాలకు ఈ సహాయం చేశామని దీనిని విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలభాస్కర్ ఉపాధ్యాయులు బాల్రెడ్డి రాములు, శ్రీనివాస్ భాస్కర్, పల్లవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత దొమ్మాట గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్ఐ ఓడాటి దామోదర్ పట్టుకున్నారు. ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ రేషన్ బియ్యం, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

హెచ్.పి.యస్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

హెచ్.పి.యస్‌లోని ఒకటో తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్టు శనివారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఓ ప్రకటనలో కోరారు జిల్లాలోని విద్యార్థుల కోసం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్, రామంతపూర్ లలో ఫస్ట్ క్లాస్ ఇంగ్లీష్ మీడియం లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానించినట్టు తెలిపారు. స్కూళ్లలో చేరబోయే విద్యార్థుల యొక్క పుట్టిన తేదీ 01-06-2017 నుండి 31-05-2018 లోపు ఉండాలన్నారు. విద్యార్థుల యొక్క తల్లిదండ్రుల ఆదాయము రూరల్ పరిధిలోని వారికి రూ.1,50,000/- , అర్బన్ పరిధిలోని వారికి రూ.2,00,000/- మించవద్దని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయవద్దు



నవతెలంగాణ-సిద్దిపేట

భవనాల నిర్మాణం కోసం ట్రాక్టర్లతో ఇసుకను తీసుకుపోతున్న వారిని పోలీసులు ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం కలెక్టర్‌ను కోరారు. శనివారం ఇసుక ట్రాక్టర్ ల డ్రైవర్లతో కలిసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా ఇసుకను తీసుకువెళ్తున్నారని, వారిని పట్టుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో బీసీలకు న్యాయం



నవతెలంగాణ-చేర్యాల

బీసీల కులగణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడం వల్ల బీసీలకు ఎంతో న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సమితి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జీ అంబటి అంజయ్య గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం అంజయ్య గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేదలకు వరం

నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గహజ్యోతి పథకం(200యూనిట్లు) అమలుకు విద్యుత్ శాఖ అధికారులు నర్సన్నపేట గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఉచిత విద్యుత్ జీరో బిల్లులను వినియోగదారులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి,నాయకులు పూడేం రాంరెడ్డి, నర్సింలు యాదవ్,తదితరులున్నారు.

ప్రజలకు వరం : తిరుపతిరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గృహలక్ష్మి పథకం ప్రజలకు వరమని కాంగ్రెస్ పార్టీ నర్సన్నపేట గ్రామ శాఖ అధ్యక్షులు పూడెం తిరుపతి రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నర్సన్నపేట గ్రామం విద్యుత్ జీరో బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నీరుగంటి యాదవ్వ,కానుగంటి నారాయణ రెడ్డి,చంద్రం, ప్రశాంత్, గణేష్,మల్లేష్,విద్యుత్ సిబ్బంది , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ,తదితరులున్నారు.





నవతెలంగాణ- గజ్వేల్

200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రభుత్వం ప్రవేశ పెట్టడం పేదలకు వరం లాంటిందని గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ నాయకులు మామిడి కృష్ణ అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని తొమ్మిదో వార్డులో ఆయన ఉచిత విద్యుత్ బిల్లును మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో ప్రతి పేదవారికి కాకుండా 200 యూనిట్లు వినియోగించే వినియోదారులకు ఈ అవకాశం ఉంటుందని అన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో పెండింగ్లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు ప్రజా ఆకర్షణ పొందుతున్నాయని ఆయన చెప్పారు.



మృణావాళిని వరించిన ఐదు ఉద్యోగాలు



నవతెలంగాణ -గజ్వేల్: ఒక ఉద్యోగం సాధించాలన్న అది దొరకాలన్న గగనం అవుతున్న కష్టకాలంలో ఒక పీహెచ్డీ చేస్తున్న యువతి ఐదు ఉద్యోగాలు ఏకకాలంలో సాధించి రికార్డు సృష్టించింది. వివరాల్లోకి వెళితే. గజ్వేల్ పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులు అమరవాది రాజశేఖర్ కుమార్తె మృణావాళి పరీక్ష రాసి ఐదు ఉద్యోగాలను ఏకకాలంలో సాధించింది. పట్టింది బంగారంగా మారిన మృణావళి ఉద్యోగాలు సాధించడం గజ్వేల్ తాలూకాలోని రికార్డ్ సృష్టించింది. ఇటీవల కాలంలో నిర్వహించిన టి.ఆర్.ఇ.ఐ.ఆర్.బి గురుకుల ఎగ్జామ్ గురుకుల పరీక్షల్లో డిఎల్, జేఎల్, పిజిటి, టీజీటీ తోపాటు టిజిటి సోషల్ ఉద్యోగాలు మృణావళిని వరించింది. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో రావి సీతాదేవి రామాయణం పద్య కావ్యం పై జేఆర్ఎఫ్ లో పిహెచ్డి చేస్తుంది. తండ్రి వర్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తండ్రి అమరవాది రాజశేఖర్ శర్మ మంచి ఉపాధ్యాయులుగా పేరు ప్రతిష్టలు తెచ్చుకున్నారు. తండ్రి బాటలోనే కూతురు ఉద్యోగాలు సాధించి రికార్డుకెక్కారు. అంతేకాకుండా పాటలను సైతం ఆమె అవలీలంగా పాడుతుంది. చురుకైన విద్యార్థిగా చిన్నతనం నుండి వచ్చిన మృణావాళికి ఐదు ఉద్యోగాలు దక్కడంతో కుటుంబ సభ్యులతో పాటు అమరవాది రాజశేఖర్ శర్మ బంధువులు, స్నేహితులు, పట్టణ ప్రజలు అభినందనలు వేలబడుతున్నాయి.

మున్సిపల్‌లో పెండింగ్ పనులను ప్రభుత్వం పూర్తి చేయాలి



- మున్సిపల్ వైస్ చైర్మన్ జకీర్

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని గత ప్రభుత్వం చేసిన పనులు కొన్ని మిగిలి ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీర్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ గణనీయంగా అభివృద్ధి చెందిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్, హరీశ్‌రావు కృషితో అభివృద్ధి జరిగిందని ప్రభుత్వం తిరిగి రాకపోవడంతో అనేక పనులు పెండింగ్లో ఉన్నాయని ఆయన అన్నారు. మున్సిపల్ పరిధిలోని అండర్ డ్రైనేజీ పూర్తిస్థాయిలో చేయడంతో పాటు మున్సిపల్ పరిధిలో ఉన్న సిసి రోడ్లు చాలా వార్డులో పెండింగ్లో ఉన్నాయని వాటికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఇంద్ర పార్క్ నుండి కోట మైసమ్మ రోడ్డు ఢిల్లీ వాళ్ళ హోటల్ వరకు పూర్తి అయిందని పాత ఎంపీడీవో కార్యాలయం నుండి కోట మైసమ్మ వరకు పూర్తిస్థాయి పనులు చేయాలని ఆయన కోరారు. కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. అభివృద్ధి పరంగా స్థానిక ప్రజలు ఎంతో సహకరించాలని గత నాలుగున్నర సంవత్సరాలుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచినట్లు ఆయన తెలిపారు. వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామన్నారు. ఇంటింటికి తాగునీరు అందిస్తున్నామని చెత్త సేకరణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. కొత్త ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ను మరింత అభివృద్ధి పరిచవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సమయంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ అభివృద్ధి దశగా ముందుకు వెళ్లిందని పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయవలసిన బాధ్యత కొత్త ప్రభుత్వం పై ఉందని ఆయన అన్నారు. కొత్త నిధులు మంజూరు చేయకుండా గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తిరిగి కేటాయించి పనులు పూర్తిచేస్తే సరిపోతుందని ఆయన చెప్పారు.

ప్రజాభిమానాన్ని చూరగొన్న వ్యక్తి శ్రీపాదరావు

- కలెక్టరేట్‌లో నివాళులు అర్పించిన అదనపు కలెక్టర్లు

నవతెలంగాణ-మెదక్

రాజకీయాల్లో ప్రజాభిమానాన్ని చూరగొని ఎంతోమంది ప్రముఖులు, రాజకీయ విశ్లేషకులతో ప్రశంసలు అందుకున్న వ్యక్తి శ్రీపాదరావు అని అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్ పేర్కొన్నారు. దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దుద్దిళ్ల శ్రీపాదరావు స్పీకర్‌గా ఉన్న సమయంలో నిజాయితీ నిరాడంబరత ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. కరీంనగర్ జిల్లాకు సుపరిచితులైన ఆయన రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేసినట్లు తెలిపారు. శ్రీపాదరావును స్ఫూర్తిగా తీసుకొని జిల్లా అభివృద్ధికి అధికారులు పునరంకితం కావాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రమేష్ మాట్లాడుతూ శ్రీపాదరావు నక్సల్స్ దుశ్చర్య వల్ల అకాల మరణం చెందడం ఎనలేని లోటు అని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్పీకర్‌గా పని చేశారని సౌమ్య మనస్తత్వం గల వ్యక్తిగా ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్టనష్టాలలో పాలుపంచుకొని ప్రజానాయకునిగా గుర్తింపు పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో యూనస్, ముఖ్య ప్రణాళిక అధికారి కృష్ణయ్య ఏడి మైన్స్ జయరాజ్, యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు, డిడబ్ల్యూఓ బ్రహ్మాజీ, డిఎస్సిఓ విజయలక్ష్మి, మత్స్యశాఖ అధికారి నరసింహారావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ఆపే సంస్కృతి కాంగ్రెస్‌కు లేదు

- యువజన మండలాధ్యక్షుడు మంకాల ప్రవీణ్



నవతెలంగాణ-బెజ్జంకి

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేయడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని..ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులాపే సంస్కృతి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి లేదని యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మంకాల ప్రవీణ్ శనివారం ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గుత్తేదారులు అభివృద్ధి పనులు చేయడానికి ఒప్పంద ప్రక్రియ పూర్తి చేసుకుని పనులు చేపట్టకుండా మళ్లీ ప్రభుత్వంపై అర్థరహితమైన ఆరోపణలు చేయడం సరైందికాదని గుత్తేదారులకు ప్రవీణ్ సూచించారు.

నర్సన్నపేట అమ్మాయికి 4ఉద్యోగాలు



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని నర్సన్నపేట గ్రామానికి చెందిన పూడేం జనార్ధన్ రెడ్డి భార్య పూడేం సుష్మ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇటీవల నిర్వహించిన ఉద్యోగాల నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. గ్రూప్ 4, టీజీటీ, పీజీటీ, జెఎల్‌లలో ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించారు. ఆమెకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

16 న సిద్దిపేట కోర్టు భవనంలో జాతీయ లోక్ అదాలత్

- డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి రఘురాం

నవతెలంగాణ-సిద్దిపేట

ఈ నెల 9న జరగవలసిన జాతీయ లోక్ అదాలత్ ను శివరాత్రి పండుగ సందర్భంగా 16కి వాయిదా వేసినట్టు జిల్లా సెషన్స్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మెన్ డాక్టర్ రఘురాం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ సిద్దిపేట కోర్టు భవనంలో 16న నిర్వహించబడునని, సిద్దిపేట ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. స్వాతి రెడ్డి, పాల్గొన్నారు.

తహసిల్దార్‌గా ఉట్కూరి శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల నూతన తహసిల్దార్‌గా ఉట్కూరి శ్రీనివాస్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు.దూళ్మిట్ట మండల తహసిల్దార్ గా విధులు నిర్వర్తించి బెజ్జంకి మండల తహసిల్దార్ గా శ్రీనివాస్ రెడ్డి బదిలీ అయ్యారు.బెజ్జంకి తహసిల్దార్ గా విధులు నిర్వర్తించిన ఎర్రోల్ల శ్యామ్ దూళ్మిట్ట తహసిల్దార్ గా బదిలీపై వెళ్లారు. నూతన తహసిల్దార్ కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి స్వాగతం పలికారు.

వైభవంగా పోతరాజు విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో పోతరాజు విగ్రహ ప్రతిష్టాపన ప్రత్యేక పూజలతో వైభవంగా నిర్వహించారు.ముదిరాజ్ సంఘ నాయకులు అక్కరవేణి పోచయ్య,రావుల కనుకయ్య,రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి నుండి సిద్దిపేటకు బస్సులు నడపాలి



నవతెలంగాణ-సిద్దిపేట

బెజ్జంకి మండలం కేంద్రం నుండి సిద్దిపేటకు బస్సులు నడపాలని హిందూ ధర్మ రక్షణ వ్యవస్థాపక అధ్యక్షులు దోనె అశోక్ బస్సు డిపో అధికారులను కోరారు. శనివారం డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెజ్జంకి మండల ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు సిద్దిపేటకు రావాలంటే బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బస్సులు నడిపిస్తే ఇబ్బందులు తప్పుతాయని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కొత్త బస్సులు లేక, ఉద్యోగాల నియామకాలు లేక, బస్సులు నడపలేకపోతున్నామని, ఒక నెల తర్వాత బస్సులు నడిపే ప్రయత్నం చేస్తామని డిపో మేనేజర్ తెలిపినట్టు తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-నంగునూరు

మండల కేంద్రంలోని నం గునూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా స్వపరిపా లన దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో పైతరగతి విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. డీఈవోగా నిఖిల్, ప్రధానోపాధ్యాయులుగా ఎస్. హర్షవర్ధన్, ఎంఈఓలుగా ఆర్. శివసాయి, వర్షిత్ మరికొంత మంది ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. తహసిన్ సుల్తానా, ఉపాధ్యాయులు కోల శ్రీనివాస్, శనిగరం కనకయ్య, పత్రి మల్లేశం, ఎం. రామకృష్ణ, జి. వెంకటేశం, ఏ. శ్రీనివాస్, జి. పరమేశ్వర్, కె. బాలపుష్ప, ఎం. ప్రమీల పర్యవేక్షించి అభినందనలు తెలియజేశారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-కొల్చారం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించేం దుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఇంచార్జ్ ఎంపీడీవో లక్ష్మి నరసింహ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాల అమలులో భాగంగా ప్రజల నుంచి ఎప్పటికప్పుడు దరఖాస్తులను స్వీకరించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రజా పాలన సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మైపాల్ రెడ్డి, సూపరింటెంట్ విటల్, కార్యదర్శి నగేష్, ఆపరేటర్లు ఉన్నారు.